



తనకు ఆనాడు ఇచ్చింది పాలు! అరటిపండు కాదేమో, ఆ పాలలో కాసిన్ని విషపు చుక్కల్ని కలిపి ఇచ్చారేమో!

ఈ జీవితమే తనకు విష పూరితమై పోయింది. ఈ జీవితాన్ని దేనితో పోలిస్తే అనువుగా ఉంటుంది.

వందన ఆలోచిస్తూంది. మానని గాయాలతో రోగిష్టిలా తయారైన ఈ శరీరం—బాధ,జుగుప్స, ఏహ్యభావం నిండిన హృదయం—అశాంతి భయంతో పిచ్చి పట్టటానికి సిద్ధంగాఉన్న మానసిక ప్రవృత్తిని పరిశీలించుకుంటూ ఆలోచిస్తూంది.

అవును. జాగు చేసి లాభం లేదు. నెల రోజులైంది. ఆనాడే ఒక నిర్ణయానికి రావలసింది. కాని లోకానికి—సంఘానికి—అత్తమామలకు — పుట్టింటికి భయపడి ఈనెల రోజులుగా ఆ నాల్గు గోడల మధ్య నరకం అనుభవించింది. తను ఇకపై భరించ లేదు. ఈ బంధాన్ని తెంపుకొని వెళ్ళిపోవాలి.

కాని తనకు ఆశ్రయం ఎవరిస్తారు? తను ఎక్కువగా చదువుకోలేదు. పదోక్లాస్ పాసు అయింది. అందంగా ఉండదు—అతి మామూలు మనిషి తను. కాని వందన చూడడానికి విందుగా—బలంగా ఆరోగ్యానికి చిహ్నంగా కనబడేది. అందుకేనేమో ఇతడు తనను పెళ్ళి చేసుకున్నది. రైల్వేలో చిన్న ఉద్యోగం. ఎత్తుగా, బలిష్ఠంగా, హుందాగా కనబడే అతడు రెండు వేల కట్నం చాలనేసరికి తల్లిదండ్రులు, తను ఆశ్చర్యపోయారు.

చాలా ఉదార స్వభావంగలవారు — అనిపించుకున్నారు వియ్యంకులు. ఏ పేచీలు—మనస్పర్థలు లేకుండానే అతి క్లుప్తంగా పెళ్ళి జరిపించారు తల్లిదండ్రులు. అదంతా వియ్యాలవారి అవుదార్యమేనని తేలిపోయింది. ఈ కాలంలో కూడా ఇలాంటి మంచివాళ్ళుంటారా! అనుకునేట్లు పెళ్ళి జరిగింది.

అతనికి సెలవు లేదంటూ వెంటనే వందనను భర్తతో పంపించేశారు. గూడూరులో వారికి చిన్న ఇల్లుంది. భర్తతో ఆ ఇంట్లో అడుగుపెట్టిన ఆమె—అక్షణంలో స్వర్గంలో అడుగుపెడుతున్నట్లు భావించింది. ప్రతి పెళ్ళి కూతురూ ఆ విధంగానే భావిస్తుందేమో! కాని ఆ గడప దాటి లోపలి వెళ్ళిన తరవాత ఆ తలుపులు ఆమెను ఖైదు చేసినట్లు బంధించుకుంటాయో లేక ఆమె చేతిలో తాళంచెవి ఉన్నట్లు మెల్లగా మూసుకుని ఆమె ఇచ్చానుసారం తెరచుకుంటాయో!

పెళ్ళి అలసట—ప్రయాణ బడలిక తీరకముందే ఆకలిగా ఉన్న పులిలా అతడు ప్రవర్తించేసరికి ఆమె హృదయం—శరీరం వెయ్యి ముక్కలై పోయింది.

అలసట—బాధ—దుఃఖం మిళితమై ఆమె కొన్ని గంటలు అలా పడి ఉంది. ఆ పందొమ్మిది సంవత్సరాల పిల్లకు ఈ ఘోరం ఎందుకు జరుగుతున్నదో కూడా తెలియడం లేదు. ఇంట్లో అడుగు పెట్టిన కొన్ని నిముషాలకే ఇతడి ప్రవర్తన ఈ విధంగా ఉన్నదంటే తనలో ఏదో లోపం చూచి ఉంటాడనుకున్నది!

ఏమై ఉంటుంది? రైల్లో ఎవరివంకనైనా చూచిందా? లేదే! అక్కడ బాగానే మాటాడాడు.

ఇంటి దగ్గర? ఏమో రిక్షా దిగి లోపలికి వచ్చింది కాని—అటు ఇటు చూడలేదు.తన ఇల్లు వచ్చిందన్న ఆనందంతో—తను ఏమైనా అతిగా ప్రవర్తించిందా?

అడగాలి—అతనినే ప్రశ్నించాలి.

ఓపిక తెచ్చుకుని లేచింది. వాతలు తేలిన శరీరానికి నూనె రాసుకుని స్నానం చేసి వంట చేసింది. ఆ తరవాత అతడికోసం నిరీక్షిస్తూ కూర్చుంది. సాయంత్రం ఆరు గంటలకు వచ్చాడు.

మవునంగా కాఫీ అందించింది.

త్రాగాడు. "నువ్వు త్రాగావా?" అని అడిగాడు. "లేదు" అంది. తెచ్చుకోమన్నాడు. ఆ మాటకే సంతోషించింది. తెచ్చుకుంది. ఆతడు త్రాగుతూ ఆమెవేపు చూసాడు. అదును దొరికిందని ప్రశ్నించింది.

"మీారు—అత్తమామగారు చాలా మంచివారని అంతా అనుకున్నారు. రాగానే నన్ను అలా కొట్టారు కదా? నేనేం తప్పు చేశాను? ఒక వేళ తెలియక మీా మనసు నొప్పించినట్లైతే నన్ను క్షమించండి'

అతడు గ్లాసు కిందపెట్టి అదోలా చూచాడు. ఆ చూపుకే ఆమె భయపడి పోయింది.

"భోంచేశావా" మామూలుగా అడిగాడు.

స్మితపడి "లేదు" అంది.

"ఐతే భోంచెయ్యి. . . ఇప్పుడే వస్తాను."

ఆతడు వెళ్ళిన వెంటనే తలుపు వేసి గబగబా భోంచేసింది. ఆనది అనబడే ఆ ఇంట్లో—ప్రథమంగా తను ఒక్కతే భోంచేసింది. ఎందుకిలా జరుగుతుంది! తినబుద్ధి కాకపోయినా ఏం చేస్తుంది! కోపం వచ్చి మళ్ళీ. . .గబగబ తిని అన్నీ సర్ది భర్త కోసం కంచం సిద్ధంగా ఉంచింది.

అరగంటకంతా అతడు తిరిగొచ్చాడు.

చేతిలో పూవుల పొట్లం ఉంది. ఆ పూలను బల్లమీాద పెట్టాడు."వందనా ఆ పువ్వులు చూడు"

ఆమె సంతోషంతో బల్ల దగ్గరకు వెళ్ళింది. మల్లెలు పరిమళాన్ని వెదజల్లుతూ నవ్వుతున్నట్లున్నాయి. ఒక్క పూవు అందుకుని వాసన చూసింది.

"పూవులు కట్టనా?" అని అడిగింది. అతడినించి జవాబు లేదు. తిరిగి చూచింది. అతడు తననే చూస్తున్నాడు. ఆ చూపులు వాడిగా ఉన్నై, ఆ కళ్ళలోని ఎర్రజీరను చూచి కంపించి పోయింది. ఉదయం. . . అతడి ముఖంలోని భావం. . . ఈ క్షణంలోకూడా. . . అదే కాంక్ష. . . ఆమె టేబిల్‌ను పట్టుకుని నించుంది. చేతిలోని పువ్వు కిందపడిపోయింది.

అతడు గబగబ ముందు కొచ్చాడు. రెండు చేతుల్లోకి ఆ పూవులను తీసుకుని కసితీర నలిపేస్తున్నాడు. ఆ చర్య అతడి కెంతో ఆనందంగా ఉంది. అతడి ముఖంలోని అలౌకికానందాన్ని పరవశాన్ని చూచింది. ఆమెకు అర్థమై పోయింది. ఇక అక్కడే నుంచో లేక రెండు చేతుల్లో ముఖం దచుకుని కూలబడి పోయింది. ఆ నలిగి పోయిన పూవులు ఆమె మీాద పడుతున్నాయి.

"క్షమించమన్నావు. దేనికి? నువ్వు పువ్వును చూచి సంతోషించావు. మత్తుగా ఆఘ్రాణించావు కాని నేను. . . నీలా ఆనందించాలంటే. . . దాన్ని నలిపి నలిపి పారెయ్యాలి. ఆదే నా ఆనందం. నిన్ను హింసించటం నా ఆనందం పరిపూర్ణ మౌతుంది..'

ఆ నాటి నుంచి తను పూవులా నలిగిపోతుంది'

ఆ పూవుకు ప్రాణం లేదు. అది నలిగి నశించి పోతుంది కాని తను? ప్రతి రోజు ఏదో ఒక బాధకు లోనవుతుంది. శరీరం పచ్చి పుండులా బాధ.

మూడవ రోజు తనను చూచి జాలి పడుతూ అంది పొరుగింటావిడ "మీా ఆయనకు తాగుడు అలవాటుందని మాకు తెలీదమ్మా. పాపం రోజూ నిన్ను కొడుతున్నట్టున్నాడు. ఎంతో సేపు కుమిలి కుమిలి ఏడుస్తున్నావు. వినికూడా ఏం చెయలేని పరిస్థితిలో ఉన్నాం. ఏదైన అవసరమయితే నన్ను అడగమ్మా. ఇంతకన్నా ఏ సాయం చెయ్యలేను."

అంతేచాలును అనుకుని తలిదండ్రులకు ఉత్తరం రాసి ఆమె కిచ్చింది. అక్కడ తను నరకం అనుభవిస్తున్నట్టు వెంటనే రావలసిందిగా కోరింది. తను రహస్యంగా రాస్తున్నట్టుకూడా రాసింది.

మూడో నాటి కంతా తలి దండ్రులు దిగారు. కూతుర్ని చూచి నిర్ఘాంత పోయారు. తల్లిని కావిలించుకుని బావురుమన్నది.

మెల్లగా అసలు విషయం తల్లికి విడమరిచి చెప్పింది. వాతలు గాయాలు మచ్చలు చూపింది. "నన్ను కొడుతుంటే నేను బాధతో మెలికలు తిరిగి పోతూ అరుస్తుంటే ఆయనకు ఎంతో ఆనందంగా ఉంటుంది. అది పైశాచిక ఆనందం. అమ్మా!


కొండపల్లి : సైనిక స్కూలు

ప్రవేశ పరీక్షలకు ప్రత్యేక కోచింగ్ క్లాసులు ప్రారంభం

* మీా అబ్బాయి వయస్సు ది. 2—7—80 కి 10—11 సం. మధ్య ఉండవలెను.
* 12. సం. అనుభవము కలిగిన ఉపాధ్యాయ బృందముచే ఇంగ్లీషు, తెలుగు మీాడియంలలో కోచింగ్ యివ్వబడును.
* ఇదివరకు వీరు కోచింగ్ యిచ్చిన విద్యార్థులకు చాల మార్కులు ఆంధ్ర రాష్ట్రము నందు మొదటి 5 స్థానములు లభించినవి. ప్రస్తుతము కొన్ని వందల మంది విద్యార్థులు కోరుకొండ నందు చదువుచున్నారు.
* హాస్టలు వసతి పరిమితము. వెంటనే చేర్పండి.

విజయ శాంతి ట్యుటోరియల్స్

29—23—4, తాడేపల్లివారివీధి, సూర్యారావుపేట, విజయవాడ—2

N.B: ఎట్టి విద్యార్హతలు లేకుండా 20 సం. నిండిన వారు ఆంధ్రా యూనివర్సిటీ బి. ఏ., బి. కాం. చదవండి.

SUVARNA



శిరాన్ బ్యూటీ పేర్లర్, సెంటార్ హోటల్, బొంబాయికి చెందిన మీనా టిపోజా యిలా అంటున్నారు

"వేర్వేరు తరహాల జుట్టుకు ఏ షాంపూ వాడాలా అనే సమస్యే లేదింక! ప్రతి ఒక్కరి జుట్టుకీ సరిగ్గా సరిపోగల రకం వుంది గ్లీమ్‌లో..."

ప్రతి గ్లీమ్ షాంపూ దానిలోని ప్రత్యేక పదార్థాల మూలంగానూ, పుష్కలమైన నురగమూలంగానూ పూర్తి ఫలితాలను ఇస్తుంది. మీా జుత్తు ఏ రకానికి చెందినది అయినా, గ్లీమ్ మూలంగా దానికో కొత్త అందం సమకూడుతుంది. దాని ఫ్రెంచి సుగంధం మిమ్ము అంటి పెట్టుకునే వుంటుంది—ఎంతో పొదుపు కూడా.

| గ్లీమ్ | గ్లీమ్ | గ్లీమ్ |
|---|---|---|
| రిగ్యులర్ | ఎగ్ | టానిక్ |

G-51A






ఇప్పుడు వీలైన 60 మి.లి. సైజులో కూడా

గ్లీమ్ షాంపూ

ప్రఖ్యాత హెయిర్ డ్రెసర్ల మెప్పు పొందినది.

Geoffrey Manners & Co. Ltd.

నాకు విముక్తి కలిగించు. నేను భరించ లేను" అంటూ ఏడిచింది.

ఆమె భర్తకు చెప్పింది. సాయంత్రం అతడు వచ్చి వీరి రాకకు ఆశ్చర్య పడినా పైకి మామూలుగానే ఉన్నాడు.

"మీ అత్తయ్య వందనను విడిచి ఎప్పుడు ఉండ లేదు. బెంగ పెట్టుకుంది. ఒక పూట చూస్తే తృప్తిగా ఉంటుందని తీసుకొచ్చాను."

"మంచి పని చేశారు" అన్నాడు. ఎన్నో కబుర్లు చెప్పుకున్నారు. రెండు రోజు లాగి వెళ్ళమన్నాడు. ఈ వంకనైన తన బాధలు తగ్గుతాయని వందన ఆనందించింది.

తలి దండ్రు లున్న నాలుగు రోజులు వందన కండికి నిండుగా నిద్ర పోయింది. తలి దండ్రులు తనను తీసుకు పోవటానికి ప్రయత్నిస్తున్నా

రని సంబర పడింది. కాని తలి దండ్రుల నిర్ణయం తెలుసుకున్న వందన తెగిన మానులా కూలి పోయింది.

"వందనా. . . అతడు ఎలాంటి వాడైన నీ భర్త. పెళ్ళయి రెండు వారాలు అయింది. అప్పుడే మా వెంట తీసుకుపోతామంటే ఏమంటాడు. నీ తరవాత ఇంకా ఇద్ద రాడ పిల్ల లున్నారు, నిన్ను తీసుకు వెళ్ళామనుకో మరి నువ్వు తిరిగి రావుగా. అప్పుడు నిన్నేమంటారో తెలుసుగా. మొగుణ్ణొదిలేసిందంటారు దాంతో నీ చెల్లెండ్రకు పెళ్ళి కాదు. వీళ్ళకి వాళ్ళ అక్క బుద్ధులే వస్తే మొగుణ్ణొది లేసి వస్తారు సంసారం చేసే వాళ్ళలా కనిపించరు అంటారు. సరే అది అలా ఉంచు. మరి మా దగ్గర కొచ్చి నువ్వేం చేస్తావు? నీకు మా తదనంతరం దిక్కెవరు? పోనీ ప్రస్తుతం నువ్వేం పని చేయగలవు? ఉన్న దానిలో ఎలాగో కష్ట పడి పెళ్ళి చేశాము. వాళ్ళంతా అన్నింటికి సరి పెట్టుకున్నారు. ఎంత కష్టంగా చేసినా నోరెత్త లేదు. వారి చేతుల్లో పెట్టాము. ఇక వారి ఇష్టం. వారికై వారు వచ్చి నిన్ను మా దగ్గర వదిలి పెడితే. అది వేరే సంగతి కాని మాకుగా మేము నిన్ను తీసు కెళ్ళలేము. ఓపిక పట్టు. కొన్నాళ్ళకు అంతా సర్దుకు పోతుంది. ఈ లోపుగా ఒక బిడ్డ పుడితే బాగానే ప్రవర్తిస్తాడు. స్త్రీకి సహనం ముఖ్యం. ఏదో కొట్టాడని వచ్చిన సంసారానికి చిచ్చు పెట్టుకోకు తల్లీ. ఇది నూరేళ్ళ పంట. ఇప్పుడు నువ్వు పడేది శారీరక బాధ కాని వదిలి వచ్చావంటే అన్నీ బాధలే, సమస్యలే, నీ జీవితమే నాశనమై పోతుంది. చిన్నదానివి కాస్త ఓపిక పట్టు అన్నీ సర్దుకు పోతాయి".

కాబోలు ననుకున్నది పాపం.

కాని తీరా వారు ప్రయాణ మయ్యేటప్పుడు ఒక్క వారం రోజులకు తీసుకెళ్ళమని బతిమాలుకుంది. హృదయ విదారకంగా ఏడిచింది. కాని లాభం లేక పోయింది.

"భర్తే నీ సర్వస్వం. అతడు ఎటువంటి వాడైన అతడి పంచనే రాణించగలవు."

ఆవుసు తల్లి సినిమాలు చూడదు. నవలలు చదవదు. కాని ఆమె భారత స్త్రీ. చక్కటి డైలాగు చెప్పి కన్న కూతుర్ని "పతివ్రత"గా ఉండమని బోధించి హెచ్చరించి వెళ్ళిపోయింది.

# కాలం పురిటి నొప్పులు....

కాలం పురిటి నొప్పులు పడుతూంది
కొత్తతరాన్ని కనే ప్రయత్నంలో
కుబుసం విడుస్తున్న ఈ క్షణాలు
కొత్త పాట వినిపించే తంత్రులై
సరికొత్త వీణను అలంకరిస్తున్నాయి
వెళ్ళలేక వెళ్ళలేక అసంతృప్తిగా
తెర మరుగవుతున్న చీకటిలో
వెలుగు వేయి రేకలై
వికసిస్తూంది – రేపటి ఉదయానికి
పూలమాలను శుభతరుణపు చిహ్నంగా
అలంకరించి ఆహ్వానించడానికి
ఆశల కుంచెకు ఆశయాల
కుచ్చు అమర్చి అబద్ధాల
వాగ్దానాల పోస్టర్ మీద
నిజాల రంగులు వేసి
రాత్రితో పోరాడిన వెలుగులా
విజయాని సంకేతంలా
విజయ కేతనాన్ని కాంతి
విహంగాన్ని ఎగరేద్దామని
పురుడు పోసుకొని కొత్త తరాన్ని
కనే కాలానికి షహనాయి
ఆలపిస్తున్నాను.

-ఎన్.వి.ఎస్. ప్రసాదరావు

అత్త మామలు వెళ్ళి పోయిన రాత్రి వడ్డీతో సహా ఆనందం పొందాడు. ఆమెజీవచ్ఛవంలా పడిఉంది

అంత బాధలోనూ ఆమె స్వేచ్ఛకోసం ఆరాట పడుతుంది. మార్గం లేకపోలేదు. అత్త మామలకు ఈ విషయం చెబితే! కనీసం తను వారికి పరిచర్య చేస్తూ ఉంటుంది. ఎవరేమనుకోరు.

తనకు అస్వస్థతగా ఉన్నదని త్వరగా రావలసినదని ఉత్తరం రాసింది.

అత్తగారువ మాత్రం వచ్చారు.

తల్లి రాకకు అతడు ఆశ్చర్య పోలేదు. కోడల్ని చూచి ఆమె కంట తడి పెట్టింది. కోడలి నోట కొడుకు ప్రవర్తన విన్న అత్త మౌనంగా తల వంచుకుని హృదయవిదారకంగా రోదించింది.

చివరికి ఆమె కోడలికి చెప్పింది, ఆమె తల్లి చెప్పిన దానికి భిన్నంగా లేదు. మామగారు అత్తగార్ని అలాగే హింసించి కొట్టేవారు. ఆమె పారిపోలేదు. గుట్టుగా సంసారం చేసింది. ముగ్గురు కొడుకులకు తల్లి అయింది. అంతా ఓర్పుతో సహించింది. తెగతెంపులు చేసుకోవాలని పారిపోవాలని ప్రయత్నించ

లేదు. అంతేకాదు "వాడు ముక్కోపి. ఎవరైనా నీ పక్షంగా మాట్లాడితే సహించడు. పర్యవసానం నీ జీవితం నరకప్రాయ మవుతుంది. వాడు నీ భర్త. నా పెళ్ళాం నా ఇష్టం అంటే ప్రపంచంలో మరెవ్వరు వాడి జోలికి పోరు. భార్యపై సర్వ హక్కులు వాడి కున్నాయి. నిన్ను తీసుకుని పోతే రెక్క దొరక పుచ్చుకుని లాక్కుపోతుంటే ఎవరడ్డగించ గలరు. ఐనా . . భర్త అన్నవాడు కట్టుకున్న భార్యను కొట్టకపోతే మరెవర్ని కొడ్తాడు! ఇల్లిల్లో చూడు, ప్రతి ఇంట్లో చూడు! అది అతి మామూలు విషయం. 'నా మొగుడు నన్ను బాధిస్తున్నాడ'ను . . . "ఏంచేశావో?" అంటారు. "కొడుతున్నాడు" అను. పకపక నవ్వుతారు. సంసారిక జీవితంలో పురుషుడు చెయ్యి చేసుకోవటాన్ని గూర్చి పెద్ద ఇదిగా చెప్పుకుని బాధపడకూడదు. ఇది సాధారణంగా చాలా ఇళ్ళలో జరిగే విషయమే. ఓర్చుకో. అంతే... మేమేం చెయ్యలేము"

"నా కర్థం కాలేదు. మామూలు కొట్టడం కాదు"

ఆమె మాటలు పూర్తిగా వినకుండానే అంది. "వాడికి కోపం జాస్తి అన్నాను. ఇంకొంచెం బాధిస్తున్నాడేమో! ఇలాంటివి ఏది మందికి చెప్పుకుని దండోరా వేసుకోరాదు. గుట్టుగా పోనివ్వాలి."

"ఈ గాయాలు వాపులు చూడండి ... నాకు ఇక్కడ ఉండడానికి భయంగా ఉంది."

"పిచ్చిదానా! భయమెందుకు? అతడు నీ భర్తే కదా! అంతా క్రొత్త. కొన్నాళ్ళు పోయాక అంతా అలవాటవుతుంది. మేమేమీ చెయ్యలేము. నువ్వు వాడి భార్యవు. వాడి ఇష్టం. నువ్వు ఎక్కడికైనా వెళ్ళినా వదలడు. ఆ కసి, పగ ఉంటుంది. అది మరీ ఘోరం."

ఆమె వెళ్ళిపోయింది.

ఐతే తనకు విముక్తి లేదా?

ఎందుకు లేదు? ఇలాగే కొన్నాళ్ళు గడిచిందంటే ఆత్మహత్య శరణ్యం! కట్నాలు చాలేదని బాధిస్తుంటే ఎంతోమంది కొత్త పెళ్ళి కూతుళ్ళు కాల్చుకుని చచ్చిపోతున్నారు! అలాంటిదే తన కేసుకూడా అనుకుంటారు. వీళ్ళెవరు విడాకుల మాట ఎత్తరే! తనే తెగించాలి!

కాని విడాకులు కోరుతూ ఎక్కడ ఉండాలి? ఎవరు పోషిస్తారు? అందుకే ఆడదానికి చేతిలో ఒక సర్టిఫికెట్ ఉన్నట్లయితే వెంటనే ఈ బంధాలు తెంచుకుని వెళ్ళిపోయేదే? తను అలాంటి పరిస్థితుల్లో ఎవరికీని భారంగా ఉండదు. తన్ను తాను పోషించుకో గలదు ... తల్లిదండ్రులు వెంటనే తీసుకుని వెళ్ళిపోయేవారు. కాని అంతరాత్మ ఒక వెకిలి నవ్వు నవ్వింది. "వ్యామోహమా! ఒక మారు నీ తల్లి అన్న మాటల్ని పునరావృత్తం చేసుకో."

పాలపొంగు మీద నీరు చిలకరిస్తే ఏమవుతుందో. అలాగే ఆమె ఆనంద పొంగు అణగారిపోయింది. నిస్సత్తువతో కూర్చుంది. ఈ చీకటి దారిలో చిరుదీపం ఉంటే అక్కడికి పోగలదు!

మరో మార్గం ఉంది.

పారిపోతే! ఎక్కడికి?

ఈ దేశంలో ఒంటరి స్త్రీ గుమ్మం దాటితే ఏమైపోతుందో! అందరికి తెలుసు. రైలెక్కి వెళ్ళి పోవచ్చు. ఎక్కడో ఒక దగ్గర దిగిపోవాలి. అప్పుడు ఎక్కడికి వెళ్ళాలి. రిక్షా ఎక్కి ఏదైనా ఆశ్రమానికో— స్త్రీ సంక్షేమ గృహానికో తీసుకెళ్ళమంటే వాడు మరొక నరకానికి తీసుకెళ్ళి పోగలడు. కనీసం ఇక్కడ తన ఇల్లు, తన భర్త — అక్కడో! అమ్మో ఇంకేమన్నా ఉందా? అసలు తనలాంటి వారికి ఆశ్రయం ఎక్కడ దొరుకుతుందో! అటువంటి ప్రదేశపు చిరునామా సంపాదించాలి. దానికి కూడ పొరుగింటావిడ సాయం కోరింది.

ఆమె సంపాదించి వందన కిచ్చేసరికి పది రోజులు పట్టింది.

రెండు చిరునామాలు హైదరాబాదువే.

ఎంతో ఓపికతో తనను గురించి వ్రాస్తూ ఆశ్రయం కోరింది. ఆ ఉత్తరం చదివితే కఠిన హృదయులు ద్రవించిపోవు. ఉత్తరాలు పోస్ట్ చేయించినది మొదలు జవాబుకోసం ఎదురు తెన్నులు చూచింది. ఎవరో ఒకరు తనకు మార్గం చూపుతారని తనకు విముక్తి లభిస్తుందని ఆశించింది.

నిజంగానే ఒక నాడు వచ్చాయి. ఆమె ఆనందానికి మేరలేకపోయింది. జవాబులు రెండు ఒకే నాడు అందటంతో ఆమె శక్తిని పుంజుకుంది.

గబగబ చదువుకుంది. ఒక్కసారిగా ఆమెను ఎవరో లాగి క్రింద పడవేసి ఏనుగుల చేత తొక్కించినట్లుగా బాధతో విలవిలాడి పోయింది.

వాళ్ళుకూడా తనకు సహాయం చేయలేరట! తనకు భర్త ఉన్నాడు. అతడి అధీనంలో ఉన్న ఆమెకు వారు ఆశ్రయం ఇవ్వలేరు. అతడి నించి విడిపోయిన తరవాత వస్తే ఆశ్రయం ఇవ్వటానికే అభ్యంతరం లేదు.

కాని అక్కడ చేరేవారంతా అనాథ స్త్రీలు. లేక అవివాహిత తల్లులు. తనకు ఎవరు లేరని ఒక కట్టు కథ కల్పిస్తే తన భర్త ఒక "సాడిస్ట్" అని అతడి నించి పారిపోయి వచ్చినట్లు చెప్పకుండా తను అనాథ అనీ ఎవరూ లేరని చెప్పుకుంటే!

ఆలోచన బాగానే ఉంది. వెంటనే అమలు జరుపుకోవాలి. వీలుచూచి రైలెక్కి హైదరాబాద్ వెళ్ళిపోవాలి. కాని అదృష్టానికో, దురదృష్టానికో అతడికి జ్వరం వచ్చింది. అతడు మంచంలో ఉన్న ఆ పది రోజులు వందనకు విశ్రాంతిగా ఉంది. అతడికి పరిచర్య చేయటంలో విసుగనిపించలేదు. అతడని ఆ పరిస్థితిలో ఒదిలి పారిపోవాలనిపించలేదు. మందు కోసం తనే రైల్వే హాస్పిటల్‌కు వెళ్ళింది. అతడికి టైఫాయిడ్ అని డాక్టర్ చెప్పాడు. ఆ తరవాత హాస్పిటల్లో జేర్చారు. అక్కడే భర్తను కనిపెట్టుకుని కూర్చుంది.

అత్తమామలు తల్లిదండ్రులు వచ్చి చూచారు. వందన ప్రవర్తనకు వాళ్ళు "పతివ్రత" అన్న బిరుదు ఇచ్చేశారు.

ఎంతైనా భర్త కదా? పసుపు కుంకుమలకోసం స్త్రీ దేనినైనా త్యాగం చెయ్యగలదు.

కొన్ని రోజుల క్రితం తను దగ్గరికి పారిపోయి "వచ్చేయాలనుకుంది" ఇప్పుడు చూడండి అతణ్ణి



భరతమాత పిల్లలు చిత్రం—మారేమండ శ్రీనివాసరావు (కర్నూలు)

కంటికి రెప్పలా చూసుకుంటుంది" అని వియ్యపు రాళ్ళు అనుకున్నారు. ఆ మాటే ఒకమారు అత్తగారన్నది: "ఇప్పుడు చూడు ఎలా పరిచర్య చేస్తున్నావో! అతడు నీ భర్త — నీ సర్వస్వం. నీ శ్రమ ఫలిస్తుంది. అబ్బాయి త్వరలో కోలుకుంటాడులే. ... డాక్టర్ గారు గండం గడిచిందన్నారు కదా."

ఆ మాటలకు ఆమె నిస్త్రాణతో ఎటో చూచింది ఆ కళ్ళలోని భయాన్ని అత్త చూడకూడదనే.

"అతడు నా భర్త — నా సర్వస్వం. అందుకేనా అతడికి సపర్య చేస్తున్నాను? ఊహు ... కానేకాదు... లోకానికి ... మీకు భయపడి ఇలా చేస్తున్నాను. కేవలం పసుపు కుంకుమలకోసమేనేమో. అతడిపై ఉన్న ప్రేమ కొద్ది కాదు. అతడంటే భయం— అసహ్యం. అతడి ఉనికి భరించలేను. అతణ్ణి తాకుతుంటే కాటువేయటానికి సిద్ధంగా ఉన్న పర్పాన్ని తాకినట్లుగా ఉంటుంది. అతడు త్వరగా కోలుకోకూడదనే నేను ప్రార్థించుకుంటున్నాను. అతడు మెల్లగా స్వాస్థ్యం పొందాలనే కోరుతున్నాను. ఈ రెండు వారాలుగా హాయిగా ఉన్నాను. కడుపు నిండుగ భోంచేస్తున్నాను. కంటి నిండుగా నిద్రపోతున్నాను. గాయాలు మానిపోతున్నాయి. శరీరంలో ఏ నొప్పి లేదు. ఇలాగే హాయిగా ఉంది. నాకు ..." అని గట్టిగా అరిచి చెప్పాలనిపించింది. అలా చెప్పలేక అతడికి త్వరలో బాగైన తరవాత తనకు కల్గే బాధను గుర్తుకు తెచ్చుకుని ఒక్కమారు దుఃఖం పట్టలేక వెక్కివెక్కి ఏడ్చింది.

అందరు దానికి మరొక అర్థం తీసుకుని తగిన రీతిన ఓదార్చి ధైర్యం చెప్పారు.

వందన ఏడవటం డాక్టర్ చూశాడు. అతడికి జాలివేసింది. పాపం క్రొత్తగా పెళ్ళయిందేమో.

భయపడుతుంది! అనుకున్నాడు.

ఆ రోజు రాత్రి రవుండ్స్ చేసి వెళ్తుంటే వందన ఆతణ్ణి అనుసరించింది. ఆమె భయం పోగొట్టాలని ధైర్యం చెప్పాలని నర్సస్ రూంలోకి రమ్మని తీసుకెళ్ళాడు.

ఆతడు ధైర్యం చెబుతుంటే వందన తల అడ్డంగా ఆడించి అంది: "నా భయం అదికాదు డాక్టర్ గారూ ..." అని ఇటు అటు చూసింది. స్క్రీన్ తలుపు అవతల నర్సులు మాటాడుకుంటున్నారు.

"మీకు ఒక రహస్యం చెప్పి మీ సలహా తీసుకుందామని వచ్చాను."

"చెప్పమ్మా. చేతనైన సహాయం చేస్తాను."

వందన తన భర్త విషయం చెప్పింది. "నన్ను హింసించటం ద్వారా ఆతడు ఆనందం పొందుతాడు. ఈ పైశాచిక ప్రవృత్తిని మాన్పటానికి మందులు ఉన్నవా? ఇది ఒక విధమైన వ్యాధి లక్షణమా? ఏం చేస్తే ఈ ప్రవర్తన పోతుంది? ఈ హింసను నేను భరించలేను. నాలోని శక్తి అంతా ఉడిగిపోయింది. అంతలో ఈ జ్వరం వచ్చి మంచమెక్కారు. మళ్ళీ బాగై తిరగటం మొదలు పెడితే మళ్ళీ కథ మొదటికి వస్తుందంటారా?"

డాక్టర్ ఆమె మాటలు విని జాలిపడ్డాడు. ఇటువంటి వారికి మోక్షం లేదే! అని ఫీలయ్యాడు.

"నువ్వెంతవరకు చదువుకున్నావమ్మా?"

"పదోక్లాసు. నాకేపని రాదండి. నన్ను నేను పోషించుకోలేను. అందుకే నన్ను ఎవరు ఆదుకోవటం లేదు."

డాక్టర్ మౌనంగా తల పంకించాడు. ఆ తరవాత మెల్లిగా అన్నాడు "దానికి మందు లేదమ్మా. ఇదొక మానసిక బలహీనత. పిల్లలను కొంత మంది ముద్దుగా కొరికి వారు ఏడుస్తుంటే ఆనందిస్తారు. అది సాధారణ చర్య. అలాగే కొందరు మరొకర్ని హింసించటం ద్వారా, మరొకరు అవమానం పాలవుతుంటే వార్ని చూడటం ద్వారా ఆనందం పొందుతారు. ఇది ప్రకృతి విరుద్ధమైనది. ఇదొక మానసిక వ్యాధి లాంటిది. మానసిక వ్యాధులు బాగు చేసే సైకియాట్రిస్ట్‌లు సహాయం చేయగలరు కాని వీళ్ళు వాళ్ళ దగ్గరకు వెళ్ళరు. ఆ బాధలను అవమానాల్ని భరిస్తూ ఉండగల స్త్రీలు మనదేశంలో కొల్లలు. . . అతడి స్వాస్థ్యం చేకూరిన తరవాత మునుపట్లా కథ మొదటికి వస్తుంది.

వందన నిలువెల్లా కంపించి పోయింది.

"డాక్టర్‌గారూ! అంతేనండీ?"

"అంతేనమ్మా. నల్ల మందు మత్తు మందులు వాళ్ళేసుకోరు. మనం ఇవ్వలేము."

"పోనీ కొన్నాళ్ళు మీరే ఇవ్వవచ్చును కదా? విశ్రాంతిగా ఉండాలని?"

"అవును. ఒక వారం పది రోజులు విశ్రాంతిగా ఉండాలని తక్కువ మోతాదులో ఇవ్వవచ్చు. ఎక్కువ మోతాదు చాలా డేంజర్ కాబట్టి. అతడు బలహీనంగా ఉన్నాడు."

ఆమె వచ్చేసింది. అతడి మంచం దగ్గిర కెళ్ళింది. అతడి ముఖంలో కళ వస్తుంటే ఆమె ముఖం కళావిహీనమై పోతుంది. అతడు రోజురోజుకు



శిలా ప్రతిమ
ఫొటో—ఎస్. శివశంకరయ్య ( కర్నూలు )

బలం పుంజుకుంటుంటే ఆమె రోజు రోజుకు తీసిపోతూంది.

ఆ వేళ ఇంటి నించి వస్తుంటే ఒక వాల్ పోస్టర్ చూచింది. ఆ రోజు సాయంత్రం శ్రీమతి రాజరత్నమ్మ ఎం. ఎల్. ఎ. మహిళా మండలి వార్షికోత్సవంలో మాట్లాడుతున్నారని అందరు తప్పక రావలసిందిగా ఆహ్వానం అది. తప్పక వెళ్ళాలనుకుంది.

సాయంత్రం ఆరు గంటలకు ఆయన నిద్ర పోతున్నాడు. పక్క బెడ్ వాళ్ళకి చెప్పి తానూ వెళ్ళింది. తన అదృష్టం కొద్దీ తన పొరుగింటావిడ కనిపించింది. ఆమె సెక్రటరీకూడా.

"ఎం. ఎల్. ఏ. గార్ని కలుసుకుంటే సాయం చేస్తారా?" అని అడిగింది. ఆమె అర్థం చేసుకుంది. మీటింగ్ అయిపోయిన తరవాత వందనను తన స్నేహితురాలిగా పరిచయం చేసింది. చివరికి ఎలాగో అపాయింట్‌మెంట్ తీసుకుంది.

"రేపు సాయంత్రం నాలుగు గంటలకు రమ్మన్నారు. నిన్ను నాతోకూడా తీసుకుని వెళతాను" అందావిడ.

అన్నట్లుగానే మరుసటి రోజు నాలుగు గంటలకు ఎం. ఎల్. ఏ. గారున్న అతిథి గృహానికి వెళ్ళారు. ఒక గంట తరవాత వారిద్దరికీ పిలుపు వచ్చింది. రాజ రత్నమ్మ వందన చెప్పినదంతా శ్రద్ధగా విన్నది.

"సరే. . . నన్నేం చెయ్యమంటారు?"

"ఏదైన ఉద్యోగం ఇప్పించండి. లేదా ఏదైన మార్గం చూపించండి. నన్ను ఇక్కడినించి మరెక్కడి కైన తీసుకుని వెళ్ళండి."

ఆమె వందన కోరికకు విస్తుపోయింది. పదో క్లాసుకు ఉద్యోగం ఏమొస్తుంది. ఒక వేళ తను ప్రయత్నించి ఇప్పించినా సంవత్సరం పడుతుంది. తను ఈమెను ఏదైనా ఆశ్రమానికో సంక్షేమ గృహానికో పంపితే అందరు ఊరుకుంటారా? ఆమె భర్త తలి దండ్రులు అత్త మామలు దుష్ప్రచారం చేస్తే తను మళ్ళీ ఎన్నికలలో ఓడిపోవటం ఖాయం. తను చాలా జాగ్రత్తగా ఉండాలి. లక్షా తొంభై ప్రశ్నలు వేసింది వందనను. చివరికి ఆమెకూడా తనని నిస్సహాయతను తెలిపింది.

"చూడమ్మా స్త్రీకి స్త్రీయే శత్రువు. నిన్ను నేను ఎక్కడికైన పంపితే ప్రథమంగా వచ్చి నన్ను ప్రశ్నించేది ఎవరో కాదు నీ అత్త. ఇది చాలా సున్నిత మైన విషయం. అంతేకాదు చాలా అపాయకర మైనదికూడాను. మగవాడు దేన్నయినా సహించ గలడేమో కాని తన కింద అణిగి మణిగి ఉండకుండా స్వేచ్ఛను కోరి పారిపోయే స్త్రీని క్షమించడు. అది అతడి అహానికి దెబ్బ. అందునా నీ విషయంలో అతడు గుట్టుగా ఉంచాలని చూస్తాడు. భర్తలు భార్యలను కొట్టటం మన దేశంలో కొన్ని ప్రాంతాలలో అతి మామూలు విషయం. ఈ అలవాటున్న పురుషులలో సాడిస్ట్‌లను వేరు చేయటం కష్టం. ఒక పల్లెకు వెళ్ళి ఒక స్త్రీని అడిగితే ఆమె 'నను. మా ఆయన రోజూ కొడుతుంటాడు. అది రోజు జరిగే విషయమే అంటుంది' అలా వందమంది ఉన్నారనుకో. ఆ వందలు నీ లాంటి భర్తలు ఇద్దరు ముగ్గురో ఉంటారనుకో. కాని ఆ వందమందికూడా ఇవి మామూలు కొట్టటాలనే అనుకుంటారు కాని, పైశాచిక అలౌకికానందం పొందే ఆ ముగ్గురో, ఇద్దరో మరో తెగకు చెందిన వారని అనుకోరు. కనక నిన్ను విడాకులు ఇప్పించి నిన్ను ఇక్కడి నుంచి ఎక్కడి కైన పంపిస్తే అందరు ఏమంటారో వేరుగ చెప్పనవసరం లేదు. కనక ఒక్కటి మాత్రం చెప్ప గలను. నువ్వు వెంటనే ఏదో ఒక పని నేర్చుకో. చదువుకో. ఆర్థిక స్వాతంత్ర్యం లభించగానే నీవు స్వేచ్ఛగా, స్వతంత్రంగా జీవించ వచ్చు ధైర్యంగా నువ్వు ఎక్కడి కెళ్ళినా ఫరవాలేదు. వేరుగా ఉండి విడాకుల కోసం ప్రయత్నించ వచ్చు. ఒకరి పంచన పడి ఉండనవసరంలేదు. దీనికంతటికీ కొంత కాలం పడుతుంది. నువ్వు ఓపిక పట్టాలి" వారిద్దరు తిరిగొచ్చారు. వందన ముఖం కొడిగట్టిన దీపంలా ఉంది. ఆ పొరుగింటావిడ అంది.

"విడాకులు కూడా అంత సులభం కాదు అతడు సాడిస్ట్ అని రుజువు చేయాలి. సాక్ష్యం ఇవ్వటానికి ఎవరూ ముందుకు రారు. జరిగింది

జరిగినట్లు నువ్వుగాని, నీ లాయరుగాని కోర్టులో చెబుతుంటేఎంత ఘోరంగాఉంటుందోఆలోచించావా మీ అత్తగారు చచ్చినా నిజం చెప్పదు. అందరూ మీ ఇద్దరి వైపు చూస్తూంటే ఆ బాధను అవమానాన్ని మీరు భరించలేరు. ఆమె అన్నట్లు ఇది చాలా భయంకరమైన విషయం. అందుకే ఇటువంటి కేసులకు ప్రత్యేకమైన న్యాయస్థానా లుండాలనేది."

"లేవా? అలాంటి న్యాయస్థానాలు లేవా?" ఆత్రంగా అడిగింది.

"లేవు."

చాలాసేపు మవునంగా నడిచారు. చివరికి వందన అన్నది

"పురుషుడి ఆధిక్యతాభావం పోదు—నాలాటి వారికి విముక్తి లేదు."

ఆమె హాస్పిటల్‌కు వెళ్ళే సరికి భర్త మెలుకువతో ఉన్నాడు. ఆమె పాలు, రొట్టె ఇచ్చింది. తింటూ అడిగాడు "ఇవ్వాళ ఆలస్యమైందేం?" అని.

"మన ఎం. ఎల్. ఏ. మహిళామండలిలో మాటాడుతుంటే మన కాలనీ వాళ్ళందరితో నేను కూడా వెళ్ళాను"

"ఏం చెప్పిందేం?"

"ఏం చెబుతుంది? పురుషుడి చెప్పు క్రింది ధూళిలా ఉన్న మీరంతా కళ్ళు తెరవండి. మీలో మానసిక పరివర్తన రావాలి. ఆర్థిక స్వాతంత్ర్యం ఉంటేనే స్త్రీ బానిసత్వం నుంచి విడుదల పొంద గలదు. ఎవరో వచ్చి మిమ్మల్నుద్ధరిస్తారనుకోవద్దు. స్వశక్తి మీద ఆధారపడి బతుకగలదు అన్న ధైర్యం మీ పుత్రికపై కలిగినప్పుడే ఆమెకు పెళ్ళి చేయండి. మీ ఆడపిల్లల ఉన్నతికొరకు తల్లులే పాటుపడాలి అంటూ చెప్పింది."

"ఆహా. . .చాలా బాగా చెప్పింది. మరి నువ్వేం చేస్తావు?" రవంత హేళన ధ్వనించింది.

"నేనా? నేనేం చెయ్యగలను? నేనేమీ చేయ లేనని మీకు తెలుసు. మీరు పెడుతున్న బాధల నుంచి తప్పించుకోలేనని మీకు తెలుసు. మీరు క్రూరంగా హింసిస్తున్నా పడి ఉంటానని తెలుసు. బైటికి వెళ్తే నా జీవితం నాశనమవుతుందని తెలుసు. నా చేతిలో చిల్లిగవ్వ లేదని తెలుసు. నేనేం చెయ్య గలను? నాల్గు రోజుల్లో మిమ్మల్ని డిస్చార్జి చేస్తారని తెలుసు. మామూలు పరిస్థితులు అయితే ఈ వార్త నాకెంతో సంతోషాన్ని చేకూర్చేదే. కాని ఇప్పుడు ఒక్కో రోజు గడిచేకొలది నా హృదయంలో భయం పెరుకు పోయింది. ఇంటికి రాగానే మళ్ళీ యమయాతన అనుభవించాలని బెంగపడిపోతున్నాను. మీకు జాలి లేదా? మిమ్మల్ని మరొకరు అలా కొడ్తే ఎలా ఉంటుంది? ఆ నొప్పి ఎలాంటిదో మీకు తెలియదా? ఆలోచించండి. మీకు నమస్కారం చేస్తాను. నన్ను హింసించకండి" ఆమె ఏడ్వడం ప్రారంభించింది.

"వందనా! నేనేం చెయ్యలేను. అది నా బలహీనత . . .ఏడవకు. . .అందరూ ఇటే చూస్తున్నారు.'

ఆ నాల్గు రోజులు వీలైనప్పుడంతా భర్తను ప్రాధేయపడి వేడుకున్నది. అతడు మవునంగా ఉండిపోయాడు. ఆ రోజు ఇంటికి వచ్చేశాడు.



త్వమేవాహం    చిత్రం—మారేమండ శ్రీనివాసరావు ( కర్నూలు )

వారంరోజులపాటు రోజులు మామూలుగా దొర్లి పోయాయి. కాని ఏ క్షణాన ఏం జరుగుతుందోనని భయంతో బిగపట్టుకుని రోజులు గడుపుతూంది.


రెండు వారాలు గడిచాయి. వీధి చివరనున్న దుకాణంలో సరుకులు కొనుక్కుని వచ్చింది. కాళ్ళు కడుక్కుని హాల్లోకి రాగానే సిగరెట్ వెలిగిస్తున్న భర్తను చూసింది. అతనికి సిగరెట్ తాగే అలవాటు లేదు! ఆశ్చర్యంతో చూచింది.

"ఈ అగ్గి పెట్టె పట్టుకెళ్ళు" అన్నాడు.

ఆమె దగ్గరకు వెళ్ళి అందుకోటానికి చేయి చాచింది. అంతే—గభాల్న ఆమె రెక్క దొరక పుచ్చుకుని సిగరెట్ అంటించాడు. ఆమె కెవ్వున కేక వేసింది. ఈ హఠాత్సంఘటన ఆమెలోని భయాన్ని విశృంఖలనం చేసింది. రెండవ చోట అంటిస్తున్నాడు. బాధతో విలవిల్లాడిపోతూ గింజుకుంటూ స్పృహ తప్పి పడిపోయింది.

స్పృహ తప్పినవారిని ఏం చెయ్యాలో చిన్న క్లాసులోనే ప్రథమ చికిత్స పేరును నేర్పిస్తారు. కాస్త వయసు వచ్చాక చదువుకొని వాడు కూడా ఆ పద్ధతులనే అనుసరిస్తాడు. కాని ఇతడు మాత్రం కాలుతున్న సిగరెట్‌ను ఆమె అరచేతికి అంటించాడు!

స్పృహ వస్తూనే కేకలేయటం మొదలు పె[illegible]ది. ఆ కేకలు ప్రతిధ్వనించాయి. ఆపకుండా అ[illegible]తో ఇరుగు పొరుగువారు పోగయ్యారు. తలుపు మీద




ధనధనమని బాదుతున్నారు. అతడు సిగరెట్ పారేసి చేతులు కాళ్ళు తన్ను కుంటున్న భార్యవేపు భయంగా చూస్తున్నాడు. తలుపు మీద కొట్టటం—తియ్యండి' అన్న అరుపుకు అతడు యాంత్రికంగా వెళ్ళి తలుపు తీశాడు.

"అయ్యో వాలిక కొరుకుంటుంది" అంటూ ఒకామె పరుగున వెళ్ళి ఒక గరిటె తెచ్చి నోట్లో పెట్టింది. అపటికే పది పన్నెండు మంది గుమి గూడారు. "డాక్టర్‌ను తీసుకురండి" అని ఒకరన్నారు. మరో ఇద్దరు పరుగుదీశారు.

ఆ పొరుగింటావిడ అంది "ఫైఫాయిడ్ వచ్చి కోలుకుంటున్నారు. ఇంకా బలహీనంగా ఉన్నారు అలా కూర్చోండి" అని కుర్చీ చూపించింది. మరో ఇద్దరు పెద్దమనుషులు అతణ్ణి కూర్చో పెట్టారు అతడిలో ఉద్రేకం లేదు. గాలిపోయిన బూరలా డీలా పడిఉన్నాడు. కొన్ని క్షణాలకు వందన సర్దు కుంది.

భర్త కనిపించకుండా పొరుగింటావిడ అడ్డంగా ఉంది. "నోట్లో నించి రక్తం వస్తోంది. రిక్షాను తెండి హాస్పిటల్‌లో చేర్పిస్తే మంచిది" మరో మగ మనిషి అన్నాడు.

డాక్టర్ కోసం వెళ్ళిన వాళ్ళింకా రాలేదు. కాని రిక్షా తెచ్చి ఆమెను రిక్షాలో వేసుకుని ఐదారుగురు ఆస్పత్రి కెళ్ళారు. వెంటనే ఆమెకు మత్తు మందు ఇచ్చారు. వందన శరీరంలో ఆ మందు ప్రాకి పోయింది. నిద్ర లోకి జారిపోయింది.

అందరు గుసగుసలు మొదలు పెట్టారు. కాలిన మూడు చోట్లను బట్టి డాక్టర్ ఏం జరిగి ఉంటుందో వూహించుకున్నాడు. కొన్నాళ్ళు ఆమెను హాస్పిటల్‌లో ఉంచితే మంచిదన్నారు.

"ఎవరైన ఆడవాళ్ళుండాలి. ఈ పరిస్థితిలో ఫిట్స్ వచ్చి ఏమైనా చేయగలరు. పడిపోగలరు" డాక్టర్ మాట విని వందన భర్త తల్లికి టెలిగ్రామ్ ఇచ్చాడు.

వందుకు మరుసటి రోజు ఉదయం మెలుకువ వచ్చింది. తానున్న పరిస్థితికి చాలా ఆనందించింది. ఇంట్లో ఒక్కత్తి భర్తతో లేదు. పది మంది మధ్య ఉంది. రెక్క మీద, అర చేతికి బేండేజి ఉంది. వాటినిచూచుకుంది. ఆ తరవాత ఏం జరిగిఉంటుందో వూహించుకుంది. ఒక విధంగా ఇలా ఉండటం సంతృప్తి కరంగా ఉంది. నర్స్ వచ్చి జ్వరం ఉందని మందు లిచ్చింది. తనకు జ్వరం తగ్గకూడదు. ఈ బొబ్బలు మానిపోకూడదు. ఇలాగే కొన్ని వారా లుండాలి అను కుంది పాపం.

మరుసటి రోజు కళ్ళు తెరవగానే అత్తగారు కనిపించింది. ఆమె నించి సానుభూతి మాటల కోసం ఎదురు చూచింది కానీ ఆమె చాలా కోపంగా కసిగా అంది "దౌర్భాగ్యురాలా! ఇంటి గుట్టు [illegible] కెక్కిందా కా వదిలావు కా వే [illegible] అసలు పెళ్ళయిన క్షణం నించి వాడి నించి విడి పోవాలి అనుకుని ద్వేషం పెంచుకున్నావే కానీ అతడు నా భర్త నా దైవం నా సర్వస్వం అని ప్రేమించి ఒద్దిగా ఉండటానికి నీ వసలు ప్రయత్నిస్తే కదూ? నీ లాటి కోడలికి సేవ చేస్తూ కూర్చోలేను. త్వరగా బాగై ఇల్లు చేరు ఇప్పటి కైన బుద్ధి తెచ్చు కుని సంసారం చేసుకో. వాడు మంచి వాడు కనక నిన్ను తరిమెయ్య లేదు."

ఆమె రెండు రోజు లుండి వెళ్ళి పోయింది.

సాయంత్రాలు భర్త వచ్చి కాస్సేపు కూర్చుని వెళ్ళి పోతాడు. అతడున్నంత సేపు ఆమె గట్టిగా కళ్ళు మూసుకుని పడుకుని ఉంటుంది.

నాలుగవ రోజు తల్లి వచ్చింది. ఆమెను చూచి ఎంతగా నో సంతోషించింది.

"మీ అత్తగారు ఉత్తరం రాసిందమ్మా. అంతా నీదే తప్పు. మా మాట విన్నావు కావు. . ."

"అవును. మీ మాట వినలేదు. ఆ బాధ నేన భరించలేక పోతున్నాను."

"అవును. భరించ లేకపోతున్నావు. కానీ నీ ఇద్దరు చెల్లెండ్ర మాట ఏమిటి? వారికి పెళ్ళి కావాలి. అది ఆలోచించావా? నీవెలాంటిబతుకు బతికేది అది కేవలం నీ ఒక్కర్తికి సంబంధించిన విషయం కాదు. నీ బతుకు నీ చెల్లెండ్ర జీవితంతో ముడి పడి ఉంది. అది గ్రహిస్తే ఈ బాధ బాధ అనిపించదు.'

తల్లి మాటల్ని శ్రద్ధగా వినింది. చివరికి అంది "అలాగేనమ్మా. కాని ఎల్ల కాలం ఇలా ఉండటం నా కిష్టం లేదు. మీరు అప్పో సప్పో చేసి చెల్లెం డ్రిద్దరికీ పెళ్ళి చెయ్యండి. ఆ తరవాత నా దారి నేను చూచుకుంటాను" ఆమాట అంటుంటే వందన కంఠం పూడకు పోయింది.

"నీ దారి నువ్వు చూచుకుంటావా? అంటే" అంది విస్తుపోతూ.

"ఏదోలే" పేలవంగా అంది.

"అయ్యో తల్లీ. . . అంత పని చెయ్యకే" ఆమె రోదించటం ప్రారంభించింది.

"ఎందుకమ్మా ఏడుస్తావు? నిన్ననే ఇక్కడికి ఒక ఇరవై సంవత్సరాల అమ్మాయిని తెచ్చారు. కాల్చుకుందట. ఎందుకో నీకుచెప్పక్కర్లేదు. బహుశః నా లాంటి విషమ పరిస్థితులో చిక్కుకుని తన్ను తాను విడిపించుకోలేక ఒకరు తనను విడిపించ నందున ఈ అఘాయిత్యం చేసింది. బతక దంటు న్నారు. ఆమె చనిపోతుంది. తలి దండ్రులు కొన్ని రోజులు ఏడుస్తారు. అంతేగా.

"అంత నిర్దయగా మాటాడకే వందనా" ఆమె నోటి పై చేయివేసింది.

"అవునమ్మా. నన్ను మాట్లాడనీ ... ఒక వేళ నేను కూడా ఇలాగే చచ్చిపోతే "

ఆమె కూతురిని మాటాడ నివ్వలేదు. కూతురి భుజం మీద తల ఆన్చి వెక్కి వెక్కి ఏడ్చింది.

తల్లి దు:ఖం చూచి వందన కూడ దు:ఖించింది.

"తల్లిగా ... ఒక్కటి అడుగుతున్నాను ... అంతపని చేయనని నాకు మాట ఇవ్వు ... అంతవరకు నేను పచ్చి మంచినీళ్ళు ముట్టను ... తల్లిగా నా కోర్కె మన్నించు వందనా?" ఆమె అతి దీనంగా వేడుకుంది.

"అలాగే నమ్మా. నేను అలాంటి పని చేయను. నాకు చనిపోవాలని లేదు. అందుకే మొండిగ ఇలా రోజులు గడప గల్గుతున్నాను. చూడు ... ఆ కిటికీ లోంచి ఒక్కసారి చూడమ్మా ... ఆ చెట్లు ఆ పచ్చని ఆకులు, ఆ ఆకుల సందులోంచి కనిపించే నీలాకాశం ... ఇవన్నీ నా కెంతో ఇష్టం అమ్మా. అంతేకాని మనిషిలోని మంచితనంక హాడా నన్నుకట్టి వేసింది. మా పొరిగిం విడ ఉన్నారు చూడు. ఆమె నాకు సహాయం చెయ్యాలని ఎంతగనో ప్రయత్నిస్తోంది. నిరాశపడిపోయిన నన్ను పైకి లేవనెత్తి ధైర్యం చెబుతుంది. ఆమె వోడిపోటం నా కిష్టం లేదు. ఎప్పటి కప్పుడు ధైర్యం పుంజు కుంటున్నాను. కానీ ... ఈ కాల్పువల్ల బాధపడలేక ఫిట్స్‌లా వచ్చింది ..." కంఠం తగ్గించి పెడికోలుగా అంది ...

"పోనీ అమ్మా! కొన్ని రోజులైనా నన్నుఇంటికి తీసుకెళ్ళవూ?" కూతురి అభ్యర్థనను ఆమె కాదన లేక పోయింది.

"అలాగేనమ్మా. త్వరలో బాగయ్యావంటే తీసు కెళ్తాను"

ఆ మాట వినగానే వందనలో నేను నిముగం

బలం వచ్చినట్లుగా ఫీలయింది.

మరి నాలుగు రోజులకు ఆమె కోలుకున్నది. ముఖంలో కళ వచ్చింది. అల్లుడికి చెప్పి కొన్నాళ్ళు విశ్రాంతికోసం వందనను ఇంటికి తెచ్చింది.

నెలరోజులు ఇట్టే గడిచిపోయాయి. ఇక నేడో రేపో ప్రయాణం కట్టేస్తారు. భర్త దగ్గరనించి కూడ ఉత్తరం వచ్చింది. వందన దిగులుగా ఉంది. తండ్రి చెల్లెండ్రకు పెళ్ళి చెయ్యాలని ప్రయత్నిస్తున్నాడు. ఇద్దరూ పదోక్లాసు పాసయ్యారు. తను ఉన్న ఆ నెల రోజుల్లో ఏ ఒక్కటి కుదరలేదు. అన్నీ సలక్షణంగా ఉంటేనే వరుళ్ళు దొరకని ఈ రోజుల్లో అక్క "అలాంటిది" ఉంటే ఇక చెప్ప నక్కర లేదు.

తండ్రి ఆ రోజు ప్రయాణం మాట ఎత్తాడు. తల్లి వెంటనే అంది: "వందనను ఇక పంపకండి. ఆ నరకంలోకి ఆమె వెళ్ళడంటే మనకు దక్కదు. ఇప్పుడు ఆరోగ్యంగా ఉంది. వెళ్ళిన వెంటనే మళ్ళీ మొదలు. ఏదో పని నేర్చుకుని తన్ను తాను పోషించుకుంటుంది. పంపకండి."

తల్లి మాటలకు వందన ఆశ్చర్యానందాలు పట్టలేక తల్లిని వాటేసుకుంది. బోరున ఏడ్చింది. తల్లి .. తన తల్లి .. ఇంత ధైర్యం చేస్తుందా? ఒకప్పుడు నీతులు గరిపిన తల్లి తనకుండగా నిలుస్తుందా. అమ్మ ... తనలాంటి ఆడది ... కాని ఎంతటి ధీరత, మనస్థైర్యం!

ఆమె ఆనందం క్షణికమే అయింది. తండ్రి గర్జించాడు. "వీల్లేదు. పెళ్ళిచేశాం. ఇక ఆమె బ్రతుకు అక్కడే వెళ్ళబోయాలి. ఇక్కడే ఉండి అందరి జీవితాలతో ముడిపడ నికి వీల్లేదు. కూతురి మీద ప్రేమతో అంటున్నావు. బాగానే ఉంది.మరి మిగతా ఇద్దరు కూతుళ్ళ మీద ప్రేమంతా ఏమైంది? ముగ్గుర్నీ పెట్టుకుని కూర్చుంటావా? వందనా సర్దుకో. తెల్లవారి బండికి వెళ్దాం."

వందన శిలా ప్రతిమ య్యింది. ఆమె నోట మాట రాలేదు.

ఈ సంఘర్షణతో వందనకు ఎక్కడలేని ధైర్యం వచ్చింది. అమ్మలాంటి వ్యక్తిలో ఇంత మార్పు వచ్చింది! కూసస్థమండూకం, పంటింటి కుందేలు లాంటి తల్లి ఇంత ధైర్యంగా తనను ఉంచేసుకోవాలని అనుకుంటుందంటే ఆమెలోని 'స్త్రీత్వం మేల్కొన్న' న్న మాటే. తన కూతురు ఒక స్త్రీ అని, ఆమె కూడ ఒక మనిషి అన్న జ్ఞానం ఆమెకు కల్గిందన్న మాట.

వందన పెట్టె సర్దుకుంటోంది. తల్లి హృదయ విదారకంగా రోదిస్తోంది. తన కూతురు అక్కడ ఎన్ని నరక యాతనల ననుభవిస్తోందో చెప్పుకుని చెప్పుకుని ఏడుస్తోంది.

తండ్రి కఠిన చిత్తుడై గంభీరంగా ఉండి పోయాడు.

ఈ మారు తల్లిని ఓదార్చటం వందన వంతు అయింది. తల్లికి ధైర్యం చెప్పింది. తండ్రి వినకుండా ఎన్నో విషయాలు చెప్పింది.

"అమ్మా—నేను ఎక్కడున్నా నీకు ఉత్తరాలు రాస్తుంటాను."

"నువ్వు నాకు అప్రతిష్ఠ తేనంతవరకు ఎక్కడ సుఖంగా ఉన్నా సంతోషమేనమ్మా" అంటూ కూతుర్ని సాగనంపింది.

వందన తన ఇల్లు అనబడే చోటికి వచ్చి చేరింది. పుష్టిగా ఆరోగ్యంగా ఉన్న భార్య చూచి ఆనందించాడతను. ఫిట్స్, ఫిట్స్ అంటూ రెండునెలలు హాస్పిటల్‌లో ఇంట్లో గడిపి తననించి దూరంగా ఉన్నందుకు కసిగా ఉంది.

తను పునః ప్రారంభిస్తాడు. మళ్ళీ ఆమెకు ఫిట్స్ వచ్చి వెర్రిగా కేకలు వేస్తూ పడిపోతే. ట్రాన్స్‌ఫర్ చేయించుకుని వెళ్ళి పోవాలి. అప్పుడు కొంత కాలం ఆమెను స్వేచ్ఛగా హింసించవచ్చును. ఆమెను రక్షించే వారుండరు. ఇక్కడ తన విషయం అందరికీ తెలిసిపోయింది.

"నా పెళ్ళాం—నా ఇష్టం!" అనుకున్నాడు.

వందన వచ్చి వారం రోజులైంది. పని ముగించిన వెంటనే భోజనం అమర్చి వంట గదిలో ఉండి పోతుంది. తెల్లగా తెల్లవారినప్పుడే ఇవతలకొస్తుంది. మొదటి రెండు రోజులు తలుపు తీయమని బెదిరించాడు. కాని ఆమె తీయలేదు. అవకాశం కోసం పొంచి ఉన్నాడు. ఒక రాత్రి వివశుడై ఆగ్రహంలో ట్రాన్స్‌ఫర్ కోసం అడిగినట్టు చెప్పేశాడు. తిట్టి అరచి నిదుర పోవటం అతనికి అలవాటై పోయింది.

వందన పొరిగింటావిడకు ఈ విషయాలన్నీ చెప్పింది. "నన్ను రక్షించండి. మీరే ఒక మార్గం చూడండి" అని ప్రాధేయ పడింది.

ఆమె ధైర్యం చెప్పింది. ఇంకొక్క వారం రోజుల్లో ఏదో ఒకటి చేస్తానని మాట ఇచ్చింది.

వందన అత్యంత ఆశతో వేచి ఉంది.

మూడవ రోజు ఆమె వందనకు ఒక కవరు అందించింది. అది చదివి ఆమెను గట్టిగా కౌగలించుకుంది.

"మీ ఋణం తీర్చుకోలేనమ్మా. మీకు సర్వదా కృతజ్ఞురాలిని" అంటూ కన్నీరు కార్చింది. ఆమె వందనకు ధైర్యం చెప్పింది.

"ఏ క్షణంలో నీవు నీ ఇల్లు విడిచి పెడతావో— ఆ క్షణం నుంచి నువ్వు ఒంటరి దానివే. ఎవరో ఒకరు తప్ప అందరు నీకు శత్రువులే. నీ గమ్యస్థానం చేరే వరకు నీవు ధైర్యంగా అతి జాగరూకతతో మెలగాలి. ఎవరైనా నిన్ను గ్రద్ద తన్నుకు పోయి నట్లు తన్నుకు పోవాలని చూస్తారు. అతి మెలకువగా ఉండాలి" అని హెచ్చరించింది.

వందన తగిన సమయం కోసం వేచి ఉంది. ఉత్తరం అందుకున్న మూడవ రోజు భర్త రైల్వే పని మీద పొరుగూరికి వెళ్ళిపోయాడు.

వందన రెండు పెట్టెలు సర్దుకుంది. ఎదురింటిలో తాళం ఇచ్చింది. "మా అమ్మగారు—కులాసాగా లేరని ఉత్తరం వచ్చింది. వెళ్తున్నాను వారికి తాళం ఇవ్వండి" అని చెప్పింది. వందన స్టేషనుకు వెళ్ళి విజయవాడ వేపు వెళ్ళే మొదటి రైలు బండి ఎక్కి వెళ్ళి పోయింది.

మూడవ రోజు ఆమె భర్త వచ్చాడు. ఎదురింటి వారు కబురు చెప్పి తాళం చెవి ఇచ్చారు. అతడు నిజమే కాబోలుననుకుని తలుపు తీసి లోపలికెళ్ళాడు.

అంతా మామూలుగానే ఉంది. బల మీద ఉత్తరం ఉంది. దాన్ని తీసుకున్నాడు.

"నేను వెళ్ళిపోతున్నాను" అంతే రాసి ఉంది.

ఆతడి క్రోధం అతణ్ణి పిచ్చివాణ్ణి చేసింది. తలగడను రక్కి రక్కి గొడుగుతో పరుపును కొట్టి, దుప్పటిని పళ్ళతో పీకి అలసిపోయి మంచానికి అడ్డంగా పడి పోయాడు. ఆ మూల దిరుగుడ కిళ్ళీ కొట్టువాణ్ణి స్టేషన్‌లో ఒక్కొక్కళ్ళని ఆమె మీద నిఘా వేసి ఉంచవలసినదిగా ఏర్పాటు చేశాడు. కాని ఆమె తప్పించుకుని పారిపోయింది.

వారం రోజులకు వందన నుంచి ఆమె తల్లికి ఉత్తరం వచ్చింది. చాటుగా దాన్ని చదువుకుని కన్నీరు వత్తుకుంది. ఆమె తృప్తిగా కూతురికి ధైర్యం చెబుతూ రాసింది. వందన మదర్ థెరిసా దగ్గరకు కలకత్తాకు వెళ్ళి పోయింది. ఈ రహస్యం ఆమెకు, ఆ పొరిగింటావిడకు మాత్రమే తెలుసు.

★

